# బహుభార్యత్వం ఎప్పుడు ఎందుకు?

152

*Taaddud-e-Azwaj (Telugu)*

# బహుభార్యత్వం ఎప్పుడు, ఎందుకు?


రచన
ముహమ్మద్ ఇనాయతుల్లా అసద్ సుబ్‌హానీ

అనువాదం
ఎస్.ఎమ్. ఖాద్రి



TRUST
తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002.

**Bahubharyatwam Yeppudu, Yenduku?**
Taaddud-e-Azwaj (Telugu)

**TIP Series No.** : **152**

Written by : Mohd. Inayatullah Asad subhani

Translated by : S.M. Quadri

All Rights Reserved with Publishers

3rd Edition : September 2016

Copies : 1000

**Price** : **Rs.25**

ISBN : 81 - 88241 - 47 - 4

Published by : Telugu Islamic Publications Trust
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడయిన అల్లాహ్ పేరుతో

# బహుభార్యత్వం ఎప్పుడు, ఎందుకు?

ఇస్లామ్ ధర్మం నికాహ్‌కు (వివాహానికి) ఎంతో ప్రాముఖ్యత నిస్తోంది. అది ఈడొచ్చిన ఏ అబ్బాయికి, ఏ అమ్మాయికీ బ్రహ్మచారులుగా లేదా అవివాహితులుగా ఉండే అనుమతి ఎంత మాత్రం ఇవ్వదు. పెళ్ళి చేసుకోగలిగే స్థోమతగల ప్రతివాడూ పెళ్ళి చేసుకోవలసిందే. ఆ స్తోమత లేనివారికి సమాజమే సహాయపడి పెళ్ళి చేయాలి. అదృష్టం కొద్ది ఎక్కడైనా ఇస్లామీయ పాలన స్థాపించబడితే ఆ పెళ్ళి చేసే బాధ్యత ఇస్లామీయ ప్రభుత్వానిదే. అదేకాదు ఇలాంటి వారికి ఉపాధిని కల్పించే బాధ్యత ఇస్లామీయ సామ్రాజ్యానిదే. యువతీ యువకులు బ్రహ్మచర్యం అనే పరీక్ష నుండి బయటపడేందుకు ఆ పాలన కృషి చేయవలసి ఉంటుంది.

ఇస్లామ్ ధర్మం నికాహ్‌కు అంత ప్రాధాన్యత ఇవ్వడానికి గల కారణం, అది మానవ సమాజాన్ని పవిత్రంగా, మచ్చలేనిదిగా చూడాలనుకోవడమే. విశృంఖలత్వం, విచ్చలవిడితనం, స్త్రీలను చెడ్డ దృష్టితో చూడడం, వ్యభిచారం లాంటి దుర్గుణాలు ఇస్లామ్ దృష్టిలో క్షమించరాని నేరాలు. అక్రమ సంబంధాలు కలిగిన ఏ పురుషుణ్ణి, మరే స్త్రీనీ ఈ ధర్మం సహించదు.

## బహుభార్యత్వం (Polygamy) లోని ఔచిత్యం

ఏ ఔచిత్యం మరే దూరదృష్టి కారణంగా నికాహ్‌కు ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందో, ఆ ఔచిత్యం మరియు దూరదృష్టే బహుభార్యత్వాన్ని

ధర్మసమ్మతం చేసింది. మానవ జీవితాన్ని లేదా మానవ సమాజాన్ని పాప పంకిలం నుండి రక్షించడానికి అవసరమొచ్చినప్పుడు ఒకరికంటే ఎక్కువ మందిని వివాహమాడే అనుమతినొసగుతోంది ఇస్లామ్. అదే గనక సామూహిక ప్రయోజనాన్ని కలిగించేదైతే దాన్ని ప్రోత్సహిస్తోంది కూడా.

ఉదాహరణకు ఒకరి భార్య దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తురాలు (Chronical disease) అయి ఉంటే ఆమె భర్త కోరికలను తీర్చలేని స్థితిలో ఉంటుంది. అప్పుడు భర్త మరో పెళ్ళి చేసుకోకపోతే అతను ఎప్పుడైనా కాలుజారి వ్యభిచార కూపంలో పడే ఆస్కారముంది. ఇలాంటి పరిస్థితిలో అతను తన గౌరవాన్ని మంటగలపడమే కాకుండా మరొకరిమానాన్ని అపహరించిన వాడౌతాడు. ఇస్లామ్ అతని ఈ వివశతను దృష్టిలో ఉంచుకొని అతనికి మరో వివాహం చేసుకునే అనుమతినిస్తోంది.

అలాగే, సమాజంలో స్త్రీల సంఖ్య పురుషుల సంఖ్యకంటే అధికం అయిందని అనుకుందాం. ఇలాంటి పరిస్థితిలో బహుభార్యత్వం అనుమతే లభించకపోతే, పురుషులకంటే అదనంగా ఉన్న ఆ స్త్రీలకు ఏ భర్తా లభించ నప్పుడు వారి గతి ఏమౌతుంది? అలాంటి స్త్రీలు, తాము చెడిపోవడమే కాకుండా తమ ధర్మాన్ని కూడా భ్రష్టుపట్టించి తమతోపాటు పూర్తి సమాజాన్నే వినాశనానికి గురిచేయడానికి వదిలేయడం సబబా?

అలాంటి స్త్రీలను పరిరక్షించేందుకు, వారి శీలాన్ని, మానాన్ని కాపా డేందుకు, వారు ఎలాంటి మచ్చలేని జీవితం గడిపేందుకు ఇటు ముస్లిమ్ సమాజం, అటు ఇస్లామీయ ప్రభుత్వం ఆ బాధ్యతను తనపై వేసుకోవలసి ఉంటుంది. అదే జరగనప్పుడు వారి శీలంగాని, మానంగాని ఎలా రక్షింప బడుతుంది? ఏ ప్రభుత్వం అయినా మరే సమాజమైనా ఈ విషయంలో చేయగలిగేదేమిటి?

ఇలాంటి పరిస్థితిలో ఏ పురుషుడు అయినా ఒక భార్యకంటే ఎక్కువ మంది స్త్రీల బాధ్యతలను వహించి ఇద్దరేసి, ముగ్గురేసి లేదా నలుగేసి స్త్రీలను వివాహమాడేందుకు ముందుకు రావడం కంటే మరో మార్గం ఏదైనా ఉందా? అంతిమ దైవప్రవక్త (స) గారి కాలంలో అప్పుడే ఉనికిలోనికి వచ్చిన ఇస్లామీయ రాజ్యంలో ఇలాంటి పరిస్థితే ఏర్పడింది. పురుషులు యుద్ధాల్లో పాల్గొని చాలా మంది వీరమరణం పొందేవారు. వారి భార్యలు వితంతువులుగా మారిపోయేవారు. అప్పుడప్పుడు ఈడొచ్చిన ఆడపిల్లలు కూడా అనాధలుగా మిగిలిపోయేవారు. ఈ పరిస్థితి ఏర్పడినప్పుడు ఈ సమస్యను పరిష్కరించడానికి పురుషులకు బహుభార్యత్వ ప్రోత్సాహం లభించడంకంటే మరో మార్గం లేకపోయింది. దివ్యఖుర్ఆన్‌లో ఆ ప్రోత్సాహ పదాలు ఇలా ఉన్నాయి:

"అనాధలకు న్యాయం చేయలేమనే భయం మీకు కలిగితే, మీకు నచ్చిన స్త్రీలను, ఇద్దరేసిగాని, ముగ్గురేసిగాని, నలుగురేసి గాని వివాహం చేసుకోండి. అయితే వారితో న్యాయంగా వ్యవహరించలేమనే భయం మీకుంటే, అప్పుడు ఒకామెనే చేసుకోండి. లేదా మీ స్వాధీనంలోనికి వచ్చిన స్త్రీలను దాంపత్యంలోకి తీసుకోండి." (నిసా:3)

ఈ వాక్యం ద్వారా మనకు రెండు విషయాలు ద్యోకతమౌతున్నాయి:

మొదటిది, ఇలాంటి నికాహ్ ప్రేరణకు కామం మూలం కాదు అన్నది. అనాధలు, వితంతువుల సహాయం మరియు వారి పరిరక్షణే దీని ఉద్దేశ్యం. దానికితోడు ముస్లిమ్ సమాజంలో పరిశుద్ధతను, పవిత్రతను కొనసాగించడానికే ఇలా ప్రోత్సహించడం జరిగింది. ఏ ముస్లిమ్ పురుషుడైనా, మరే స్త్రీ అయినా వ్యభిచారం, అశ్లీలం అనే పాప పంకిలంలో కూరుకుపోవ డానికి వివశులుకాకూడదు అన్నదే.

ఇక రెండవ విషయం, కేవలం న్యాయం, ధర్మం కోసమే నెలకొన్న ప్రభుత్వానికి ధార్మిక, సామాజిక సేవలను అందించడం కోసం వారు

ఒకరికంటే ఎక్కువ మందిని పెళ్ళాడి ఆ భార్యల నడుమ పూర్తి న్యాయం చేకూర్చేందుకు అడుగుముందుకు వేయాలనే ఉద్దేశ్యం తప్ప, ఒకరి ఇల్లు చక్కబెట్టడానికి మరొకరి సంసారాన్ని చెడగొట్టే ఉద్దేశ్యంగాని, ఒకరిని సంతోష పరిచేందుకు మరొకరి మనసును విరిచే ఉద్దేశ్యంగాని ఏ మాత్రం ఉండకూడదు అని హెచ్చరించడమూ జరిగింది.

దివ్యఖుర్‌ఆన్ సూచనలు వెలువడింది ఈ నేపథ్యంలోనే. ఆ బోధనల ఫలితాలు ఇప్పుడు ఎలా బయల్పడుతున్నాయో చూద్దాం.

## బహుభార్యత్వంలో గల శుభాలు

తగ్గిపోతున్న పురుషుల జనాభా, పెరిగిపోతున్న స్త్రీల జనసంఖ్యకు సంబంధించి ఏ గడ్డుపరిస్థితి అయితే ఏర్పడిందో ఆ సమస్యను ముస్లిమ్ సమాజం పూర్తిగా నియంత్రించగలిగింది. ఆ సమాజంలో స్త్రీలు ఎవరో ఒకరి వివాహబంధంలో ముడిపడి ఉండకుండా ఉండలేదాకాలంలో.

ఆ రకంగా చెడు వ్యాపించే మార్గాలన్నీ మూసివేయబడ్డాయి. అశ్లీలం వ్యాపించే బాటలన్నీ మూసుకుపోయాయి. సమాజం మొత్తమే పవిత్రత, పరిశుద్ధత, సచ్ఛీలతల ఉన్నత శిఖరాలకు చేరుకుంది. షైతానుకు ఏమి చేయాలో ఎటూ పాలుపోలేదు. అతను తన అపజయానికి ఆనాడు వగచినంతగా అప్పుడూ, ఇప్పుడూ మరెప్పుడూ వగచలేదు.

ఈ విధంగా ఒకవైపు సమాజం మొత్తమే పూర్తి పరిశుద్ధతతో నిండిపోగా మరోవంక దైవమార్గంలో ప్రాణాలను అర్పించడానికి సిద్ధంగా ఉండే ముజాహిదుల ఓ సైన్యమే తయారౌతూపోయింది. ముస్లిమ్ నాయకత్వానికి ఎన్నడూ ముజాహిద్‌ల కొరత ఏర్పడలేదు.

ముస్లిమ్ నాయకత్వం రెండేళ్ళకు పైన్నే నిరంతరం యుద్ధ వాతావరణాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. **ఆనాటి సూపర్ పవర్లైన రోమన్,**

ఈరాన్ సామ్రాజ్యాలతో ఎన్నో యుద్ధాలు చేయవలసి వచ్చింది. ఆ యుద్ధాల్లో ఎందరో ముజాహిద్‌లు ప్రాణాలు పోగొట్టుకోవడమో, క్షత గాత్రులు కావడమో, వికలాంగులైపోవడమో జరిగింది. ప్రవక్త మహనీయుల (స) హయాములో ప్రారంభం అయిన ఆ యుద్ధాల పరంపర అబ్బాసీల హయాము వరకు అలా కొనసాగుతూనే ఉండింది. ఆ తరువాత 'తాతారీల'తో ఎన్నో పోరాటాలు జరిగాయి. ఆ పిదప క్రూసేడు యుద్ధాలు ఓ సుదీర్ఘకాలం వరకు కొనసాగుతూనే పోయాయి.

ఇంత జరిగినా ముస్లిమ్ నాయకత్వపు ధైర్యసాహసాలు ఏ మాత్రం తగ్గలేదు. దానికి కారణం ముజాహిద్‌ల సంఖ్యలో ఏ కొరత రాకపోవడమే. పటాలాలకు పటాలాలే నేలకొరుగుతూ ఉండగా వాటి స్థానంలో కొత్త పటాలాలు పుట్టుకురానారంభించాయి.

దీనికి భిన్నంగా మనం గనక అయిరోపా దేశాలపై దృష్టిసారిస్తే, ఓ పాతిక ఏళ్ళలోనే రెండు ప్రపంచ యుద్ధాలు ఆయా దేశాల పరిస్థితిని ఎలా మార్చిపారేశాయో అర్థం చేసుకోవచ్చు. బ్రిటీషు ప్రెస్సునుండి సేకరించిన ఈ క్రింది గణాంక వివరాలను బట్టి చూస్తే ఆ పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉండిందో అంచనా వేసుకోవచ్చు. 'సన్‌డే క్రానికల్' (Sunday Chronicle)లో ఓ మహిళా జర్నలిస్టు ఇలా రాస్తోంది:

"బ్రిటన్‌లో ప్రస్తుతం ముప్పై లక్షల మందికంటే ఎక్కువే తమ భర్తలను, సంతానాన్ని, ఇల్లూ వాకిలిని పోగొట్టుకొని ఓ నిర్జీవమైన జీవితాన్ని అనుభవిస్తున్నారు. ఇక్కడ స్త్రీల జనాభా గత శతాబ్దంలోకంటే బాగా పెరిగిపోయింది. 1939లో స్త్రీల సంఖ్య పురుషులకంటే బాగా పెరిగింది. అలా పెరిగిపోయిన స్త్రీల సంఖ్య 28,18,343. ఇప్పుడు ఇంకా మరి మూడు లక్షలమంది పురుషులు యుద్ధంలో ప్రాణాలు వదిలారు. వేలాదిమంది పురుషులు వికలాంగులయ్యారు, వీరు కనీసం లేచే పరిస్థితిలో కూడా

లేరు. ప్రస్తుతం ఆ లక్షలాదిమంది స్త్రీలు, యువతులకు ఆధారంగా ఉన్నవారు పోయిన తరువాత వీరి గతి ఏంగానున్నదో! యుద్ధానంతరం ఏర్పడిన ఈ సమస్య బ్రిటన్ సమస్యల్లో అతి క్లిష్టమైన సమస్యగా మారిపోయింది.''

ఇక్కడ ఆలోచించవలసిన విషయం ఏమిటంటే, ముస్లిమ్ పాలన వరుసగా రెండేళ్ళకంటే ఎక్కువ కాలమే యుద్ధ పరిస్థితిని ఎదుర్కోవలసి వచ్చింది. ఆ యుద్ధం కూడా ఆషామాషి యుద్ధం ఏమీ కాదు. ప్రతి యుద్ధం ఓ ప్రపంచ యుద్ధంకంటే తక్కువైందేదీ కాదు. అప్పటి సూపర్ పవర్లు అనబడే రోమన్, ఈరాన్ సామ్రాజ్యాలతో ఓ సుదీర్ఘకాలం వరకు యుద్ధాలు జరిగాయి. ఆ పిదప తాతారీలతో ఘోర యుద్ధాలు చేయవలసి వచ్చింది. ఆ తరువాత క్రూసేడులు (శిలువ యుద్ధాలు) కూడా తుఫానుల్లా ఇస్లామీయ జగత్తుపై విరుచుకుపడ్డాయి.

అంతంలేని ఈ యుద్ధాల పరంపరను ఎదిరించే శక్తి మరే జాతికి సాధ్యం కానిది. అయితే ఒక్క ముస్లిమ్ జాతి మట్టుకే వాటిని ఎంతో ధైర్యంతో ఎదుర్కోగలిగింది. విజయాలను సాధించగలిగింది. ముజాహిద్‌ల కొరతగాని, స్త్రీల పెరుగుదల వితంతువుల సమస్యగాని ఆ జాతికి ఎదురు కాలేదు. దానికి భిన్నంగా అయిరోపా రెండే రెండు యుద్ధాలతో బేజారై పోయింది. లక్షలాది మంది కన్యలు, వితంతువులు పురుషుల కోసం ఎదురు చూస్తూ ముసలివాళ్ళై పోయారు.

ఈ భూమ్యాకాశాల తేడా ఎందుకు ఏర్పడినట్లు? ముస్లిమ్ జాతి బహుభార్యత్వ చట్టాన్ని అవలంబించి దాన్ని వికసింపజేయడం వల్లనే ఈ తేడా ఏర్పడింది. పాశ్చాత్య దేశాలు, క్రైస్తవ సమాజం ఈ చట్టాన్ని నిరాకరించడం వల్లనే దాని ఆ దుష్పరిణామాన్ని అనుభవించాల్సి వస్తోంది.

## బహుభార్యత్వ చట్టాన్ని అవలంబించడానికి కావలసిన వాతావరణం

బహుభార్యత్వ చట్టం ఓ సజీవ జాతి కోసం ఉనికిలోనికి వచ్చిన చట్టం. ప్రపంచంలో ఓ కార్యసిద్ధి కోసం జీవించే వారే దాన్ని అవలంబించ గలరు. మహత్కార్యాన్ని సాధించాలనేది ఆ జాతి స్త్రీ పురుషులిరువురి దృక్పథంగా ఉండింది. ఆ జాతికి చెందిన స్త్రీలు తమ సంతానాన్ని సాకేది, వారు పెరిగి పెద్దవారై దైవమార్గంలో జిహాద్ చేస్తారని, తమ రక్తతర్పణ ద్వారా ఇస్లామ్ ధర్మానికి ఔన్నత్యాన్ని చేకూరుస్తారనే ఉద్దేశ్యంతోనే. తమ సంతానం 'షహాదత్' లాంటి అత్యున్నతమైన పదవిని అలంకరిస్తారనే ఉద్దేశ్యంతోనే ఆ జాతి వీరమాతలు తమ పిల్లల్ని పెంచి పెద్దచేశారు. అదీ ఆ జాతి సజీవగాథ.

ప్రఖ్యాత సహాబియా 'హజ్రత్ ఖన్సా (ర)', 'ఖాదసియా' యుద్ధం జరుగుతున్నప్పుడు యవ్వనంలో ఉన్న తమ నలుగురు కుమారులను పిలిపించారు. ఏ చేతులతోనైతే వారిని పెంచిపోషించి పెద్దజేశారో ఆ చేతుల తోనే ఆమె వారి తలలపై కఫన్ వస్త్రాన్ని కడుతూ, "నా ప్రియ కుమారు ల్లారా! ఈ రోజు కోసమే నేను మిమ్మల్ని పెంచి పెద్దవారిగా చేశాను. వెళ్ళండి! దైవవిరోధులతో జిహాద్ చేయండి. మీ రక్తం చిందించి ఇస్లామ్ ధర్మాన్ని కాపాడండి. చూడండి! ఇక ఈ ఇంటిని మీరు శాశ్వతంగా వదిలేయండి. స్వర్గంలో మీ కోసం ఇల్లు సిద్ధంగా ఉంది. వెళ్ళి, ఆ ఇంటినే తీర్చిదిద్దు కోండి. ఈ రోజున నేను మిమ్మల్ని దైవానికి అర్పించేశాను. బహుశా ఈ లోకంలో ఇదే మన చివరి చూపు. దైవం తలిస్తే మనం స్వర్గంలోనే కలుసుకోగలం" అని చెప్పి మరీ పంపించారు యుద్ధరంగానికి. అది ఆ ఒక్క మాతృమూర్తి మాటేకాదు. ఆనాటి ప్రతి మాతృమూర్తి తమ సంతానానికి ఇలాంటి మాటలనే ఉద్బోధిస్తూ ధైర్యం చెప్పి యుద్ధానికి పంపించేది.

ఆ మహోన్నతమైన, పరిశుద్ధమైన భావాలే ఆనాటి స్త్రీ పురుషులందరి మనోహృదయాల్లోనూ సుడులు తిరుగుతూ ఉండేవి. పురుషుల విషయాని కొస్తే, ఆ భావోద్రేకాలు ఎలా ఉండేవో ఈ క్రింది సంఘటన ద్వారా తెలుసుకో వచ్చు.

ఓ నవ యువకునికి ఆ రోజే పెళ్ళి జరిగింది. నవ వధువుతో అతను ఆ రాత్రి గడిపాడు. మరునాడు ఉదయాన్నే యుద్ధంలో పాల్గొనాలనే పిలుపు విన్నాడు. ఆ ఆత్యయిక పరిస్థితిలోనే ఉన్నపళాన అతను దైవ మార్గంలో పోరాడడానికి బయలుదేరి వెళ్ళాడు. అతని నవవధువు సంతోషంగా అతణ్ణి యుద్ధరంగానికి సాగనంపింది. కొన్ని గంటల సమయం గడిచిందో లేదో తన భర్త షహీద్ అయిపోయారనే వార్త ఆమెకు అందింది. ఆ వార్త విన్న ఆ వధువు, తాను ఓ షహీద్‌కు వితంతువును అనే గర్వంతో అందరివైపు చూసింది. ఆ యువకుడూ మరెవరో కాదు, ఆయన హజ్రత్ హంజలా (ర). చరిత్రలో ఆయనపేరు 'హంజలతుల్ గుసైల్'గా ఖ్యాతిపొందింది.

ఓ సజీవమైన, గౌరవప్రదమైన సమాజం అది. కేవలం అల్లాహ్ ప్రసన్నతను బడయడానికే స్థాపించబడిన సమాజమది. అల్లాహ్ కోసమే జీవించడం, ఆయన కోసమే మరణించడం ఆ సమాజ చిహ్నం. ఈ పవిత్ర సమాజంలో బహుభార్యత్వం ఎప్పుడూ సమస్యగా మారలేదు. పైగా ఆనాటి సమాజానికి దాని అవసరం ఎంతైనా ఉండింది.

ఆనాడు ఓ వ్యక్తి వివాహమాడినా అతని ఒకరికంటే ఎక్కువ మంది భార్యలు పరస్పరం తోబుట్టువుల్లా ప్రేమగా మెలిగేవారు. సవతుల్లో కానవచ్చే ఈర్ష్యాద్వేషాలు వారిలో మచ్చుకైనా అగుపడేవి కావు. పురుషులు కూడా వారి పట్ల నిలువెల్ల ప్రేమానురాగాలు కలిగి మెలిగేవారు. కారణం, వారు కాబోయే ముజాహిద్‌ల తల్లులు గనుక. ఒకరిపట్ల ఆదరణ మరొకరి పట్ల

అనాదరణ అన్న ప్రశ్నే ఉత్పన్నం కాకపోయేది. స్త్రీ అందచందాలు గాని, ధనసంపత్తులుగాని ప్రాతిపదికలుగా ఉండే ఆస్కారమే లేదు. ఇక్కడ దాంపత్య బంధనానికి మూలం దైవప్రసన్నత పొందడం, ధార్మికత, నైతికతలే. కాబట్టి ఒకరి మనసులో మరొకరి కోసం ప్రేమ, త్యాగాలు ఉంటూ ఉండేవి. ఒకరి పట్ల మరొకరికి గౌరవభావం, పరస్పర హక్కుల గురించిన విలువా ఉండేవి.

నేడు పరిస్థితి దానికి పూర్తిగా భిన్నమైన పరిస్థితి. భావాలు మారి పోయాయి. ఆలోచనా సరళీ మారిపోయింది. నేడు పురుషుల్లోగాని, స్త్రీలలో గాని ఆ భావాలు, ఆ ఆలోచనలు మచ్చుకైనా కానరావడం లేదు. పరుల విషయం అటుంచి స్వయంగా ముస్లిములలోనే బహుభార్యత్వాన్ని విమర్శించే వారున్నారు. దీన్ని పరిహసిస్తున్నారు కూడా. నేడు బహుభార్యత్వ విధుల్ని, బాధ్యతలను నిర్వహించడం అంత సులువైన విషయం ఏమీ కాదు. అలాగే దీన్ని స్త్రీలు కూడా సహించే స్థితిలో లేరు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ సమస్య యొక్క యదార్థాన్ని తెలుసుకోవాలంటే కొన్ని అంశాలను దృష్టిలో ఉంచుకోవలసి ఉంటుంది.

## బహుభార్యత్వపు స్వభావం

ఈ విషయంలో గుర్తుంచుకోవలసిన మొదటి అంశం ఏమిటంటే, పాశ్చాత్యదేశాలు, వారి భావబానిసత్వానికి గురైన కొందరు ముస్లిమ్ మేధా వులు చేస్తున్న నేరారోపణల ప్రకారం, "ఇస్లామ్ ధర్మం, పురుషులకు వ్యభిచారం చేయడానికి, కామ వాంఛల్ని తీర్చుకోవడానికి ఈ బహుభార్య త్వపు చట్టం ద్వారా ప్రోత్సహిస్తోంది" అన్నది. అయితే ఆ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి. బహుభార్యత్వం పురుషుల బాధ్యతలను మరింతగా పెంచుతోంది. ఎవరైనా ఒకే ఒక వివాహం చేసుకుంటే అతనిపై ఒకే ఒక భార్య, ఆమె సంతానం బరువు బాధ్యతలు పడతాయి. అదే

ఒకరికంటే ఎక్కువ మందిని వివాహమాడితే ఆ పెరిగిన భార్యలు మరియు వారి సంతానం  బరువు బాధ్యతలు అతనిపై అదనంగా పడతాయి.

ఇక ఎవరైనా వ్యభిచారం చేయదలిస్తే అతను ముగ్గురేసి, నలుగురేసి భార్యలను పెళ్ళాడడం అటుంచి ఆ ఒక్క పెళ్ళి కూడా ఎందుకు చేసుకోవాలి? ఇది బాగా అర్థం చేసుకోవలసిన విషయం. వ్యభిచార మార్గం వివాహ మార్గానికి పూర్తి భిన్నమైన మార్గం. వ్యభిచరించదలచిన వాడు కామవాంఛ రేగినప్పుడల్లా ఏ వ్యభిచార గృహానికో వెళ్ళి తనకు నచ్చిన అందగత్తెతో ముఖానికి మసిబూసుకోవచ్చు. తన యవ్వనాన్ని, తన శక్తి సామర్థ్యాలను మంటగలుపవచ్చు. అంతేకాదు అతను స్వతంత్రంగా ఎటుబడితే అటు తిరిగి రావచ్చు. అతనికి పెళ్ళి చేసుకొని సంతానాన్ని గనే అవసరంగాని, ఆ సంతానాన్ని పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు గరిపే అవసరంగాని, వారికి బట్టలు కుట్టించే బెడదగాని, ఆ సంతానం వ్యాధిన బడితే చికిత్స చేయించే, రాత్రింబవళ్ళు తన నిద్రాహారాలను మానుకొనే అవసరంగాని ఎక్కడిది? అలాగే అత్తామామలు, బంధువుల ముఖం చూసే అవసరంగాని, వారి హక్కులను పరిరక్షించే బాధ్యతగాని  అతనికి ఏ మాత్రం ఉండవు. దీనికి భిన్నంగా పెళ్ళి చేసుకున్నవాడు మొదటి రోజు నుండే తన మెడలో బరువు బాధ్యతల గుదిబండను వేసుకుంటాడు. ఆ బాధ్యతల నిర్వహణ కోసమే జీవిస్తాడు. ఆ బాధ్యతలే అతని మనస్సుకు శాంతాన్ని చేకూరుస్తాయి.

వ్యభిచరించేవాడు పెళ్ళి జోలికే పోడు అన్నది యదార్థం. మీ చుట్టు ప్రక్కల దృష్టిని సారించి చూడండి. అనేక ఉదాహరణలు మీకు అగుపడతాయి. అంతదూరం ఎందుకు? మన దేశంలోని జోగినులు, దేవదాసీల పరిస్థితులనే చూడండి; వారి శీలాన్ని దోచుకోవడానికి, వారి గౌరవాన్ని మంటగలపడానికి **ఎలాంటి ఎలాంటి వాళ్ళు** వారి వద్దకు వచ్చి

పోతుంటారో! ఇక నాగరిక సమాజంలో వాటి ఉదాహరణలు కావాలంటే, అయిరోపా దేశాలను పర్యటించి రండి. అడుగడుగునా ఆ నమూనాలు మీకు అగుపడుతుంటాయి. అమెరికా, అయిరోపాలకు వెళ్ళలేకపోతే, వివాహమే నిషిద్ధం చేసుకున్న అక్కడి క్రైస్తవ మతప్రచారకుల (ఫాదరీల) చరిత్రనే తిరగేసి చూడండి. వారు వ్యభిచారానికి సంబంధించిన ఎలాంటి ఉదాహరణలను నెలకొల్పారో తెలుస్తుంది.

అయిరోపా ఖండానికి చెందిన ప్రముఖ చరిత్రకారుడు 'లేకీ' (E.H. Lecky) తన గ్రంథం History of European Morals (అయిరోపా నైతిక విలువల చరిత్ర)లో ఇలా రాస్తున్నాడు:

"పోప్ జాన్ (23) వ్యభిచరించాడు. స్వయం తన తల్లి మరియు సోదరితోనే వ్యభిచరించాడు. కాంటర్‌బరీ (Canterbury) బిషప్పు 1171లో కేవలం ఒకే ఊళ్ళో 17మంది అక్రమ సంతానానికి తండ్రి అయ్యాడు. స్పెయిన్ ఫాదర్ ఒకడు 1130లో ముప్పైమంది దాసీలను కలిగి ఉన్నాడు. సీజర్ (Caesar) ఫాదరీ అయిన మూడవ హెన్రీకి 1274లో అరవై మంది అక్రమ సంతానం ఉండింది."

కాసేపటి కోసం వాటన్నిటి నుండి దృష్టి మరల్చి చూస్తే, అప్పటి మత బోధకుల సాధారణ విచ్చలవిడితనం, వ్యభిచారాన్ని రుజువుపరిచే ప్రామాణికమైన రుజువులు మనకు కోకొల్లలుగా కానవస్తాయి. పవిత్రంగా నిష్ఠతో కూడుకొని ఉండవలసిన క్రైస్తవ మత పీఠాలు (చర్చీలు) మఠాలుగా కాకుండా వ్యభిచార కూపాలుగా, అక్రమ సంతాన ఖనన వాటికలుగా మారిపోయాయి. వ్యభిచారం, అక్రమ సంబంధాల కారణంగా ధర్మానికీ అధర్మానికీ మధ్య తేడా ఏమిటో తెలియకుండా పోయింది. ఆ కారణంగానే, మతబోధకులు ఇక నుండి తమ సొంత తల్లులను, అక్కాచెల్లెళ్ళను కలువకూడదు అనే చట్టాలు చేసే అవసరం ఏర్పడింది. స్వయంగా మతాధి

పతులు కూడా అందరికంటే ఆ పాపపంకిలంలో కూరుకుపోయారు.

ఇలా జరగడానికి గల కారణం ఏమై ఉంటుంది? పెళ్ళిని నిషిద్ధం చేసిన దానికి ఏర్పడిన దుష్ఫలితమే ఇదంతా. పెళ్ళి లేదా 'నికాహ్' సహజమైన పవిత్ర విధానాన్ని అంతమొందించడానికి ప్రయత్నించడమే ఈ రుగ్మతలన్నింటికి మూలం. నీరు ప్రవహించే మార్గాలన్నింటిని మూసివేస్తే కొన్నాళ్ళకు నీటి టాంకులోని నీరు చెడిపోకుండా, చెడు వాసన గొట్టకుండా ఉంటుందా?

ఇదంతా క్రైస్తవ సన్యాసులు, ఫాదరీల కథ. మహనీయ ముహమ్మద్ ప్రవక్త (స)ను అసహ్యించుకుంటూ, ఆయన తొమ్మండుగురు భార్యలను కలిగి ఉన్నారు ఆయన్ను మెమెలా గౌరవించేది? అని చెప్పే క్రైస్తవ సన్యాసులు, ఫాదరీల వ్యభిచార కథ ఇది. *(చూడండి, అల్‌మర్‌అతు బైనల్ ఫిఖా వ ఖానూన్-డా. సబాయి, పు-93)*

ఈ దురదృష్టవంతులే స్వయం తమ గౌరవాన్ని కాపాడుకోవలసి ఉంది. స్వయంగా అశ్లీలం, వ్యభిచారంలో చిక్కుకొని ఉన్నవారు మరొకరిని ఎలా గౌరవించగలరు? మన ప్రవక్త (స) వారికి ఆయన ప్రభువు ఏ గౌరవాన్ని ప్రసాదించాడో అదే ఆయనకు చాలు.

## భార్యల సంఖ్యకు సంబంధించిన షరతులు

పురుషులకు ఒకరికంటే ఎక్కువ మందిని పెళ్ళాడే అనుమతి, ఆ భార్యల నడుమ ఏ కొంచెం అన్యాయం కూడా జరగకూడదు అనే షరతు బెట్టి మరీ ఇవ్వడం జరిగిందన్నది మనం గమనించాలి. ఏ వ్యక్తి అయినా తన భార్యలకు న్యాయం చేకూర్చలేకపోతే, వారి విషయంలో ఎలాంటి బాధ్యతలను నిర్వర్తించకపోతే తప్పుపట్టవలసింది అతణ్ణే. అంతే తప్ప ఈ చట్టానికి అతని ప్రవర్తనతో ఎలాంటి సంబంధం లేదు. అతని ఈ వైఖరి

కారణంగా ఈ చట్టాన్నిగాని, దాన్నుండి ఒనగూడే ప్రయోజనాన్నిగాని తప్పుబట్టలేం. ఒకరికంటే ఎక్కువమంది భార్యలు గలవారు తమ భార్యలకు న్యాయం చేయడం లేదంటే, దానికి కారణం అతనికి ఎక్కువమంది భార్యలున్నారని కాదు.

దీనికి సంబంధించిన అనేక ఉదాహరణలను మనం ఇవ్వవచ్చు.

ఒకరికంటే ఎక్కువ మందిని వివాహమాడి వారికి పూర్తి న్యాయం చేసిన ఉదాహరణలు అనేకం మన ముందున్నాయి. భార్యలు తమ ఇళ్ళలో తోబుట్టువుల్లా మెలిగిన వారున్నారు. వారిలో ఒకామె సంతానం పొందితే మరొకామె ఆ భాగ్యానికి నోచుకోనప్పుడు, ఆమె తన సవతి సంతానాన్ని తన కన్న పిల్లల్లా సాకి పెద్దజేయడం జరిగింది. చూసేవారికి ఈ పిల్లలు ఆమె సొంత పిల్లలా అన్న భ్రమ కలిగింది. ఇక ఇరువురు భార్యలకూ సంతానం కలిగితే, వారిరువురూ తమ సంతానాన్ని సమానమైన ప్రేమానురాగాలతో సాకారు. తెలియని వారికి ఆ పిల్లల తల్లులెవరో తెలియడం కష్టమైపోయింది.

నేడు ఏ ఇంటనైనా ఇద్దరు భార్యల నడుమ న్యాయం జరగడం లేదంటే దానికి కారణం ఆ వ్యక్తి ఆ రెండవ పెళ్ళి చేసుకున్నది మొదటి భార్యతో వేగలేకనో లేదా వారి మధ్య భేదాభిప్రాయాలు అధికం అయిపోవడం మూలంగానో. అంటే, ఆ రెండవ పెళ్ళి వారిద్దరి నడుమ ఏర్పడిన అగాధానికి ప్రతిచర్య కావచ్చు. అలాంటప్పుడు అలా జరిగిన రెండవ వివాహంలో న్యాయం చేసే ఆస్కారం ఎక్కడుంటుంది?

మొదటి భార్యను శిక్షించడానికీ, ఆమెను మరింత ఏడిపించడానికీ, ఆమె హక్కుల్ని కొల్లగొట్టడానికే రెండవ పెళ్ళి చేసుకోవడం జరుగుతోంది. ఈ వైఖరికి ఇస్లామ్ ధర్మంతో ఎలాంటి సంబంధం లేదు. ఇస్లామ్ ఇలాంటి

నడవడికను అసలే సహించదు.

ఈ వివాదాన్ని తీర్చాలంటే కుటుంబంలోని పెద్ద మనుషులు ముందుకు వచ్చి వారి నడుమ రగులుతున్న ద్వేషాన్ని చల్లార్చాల్సి ఉంటుంది. వారి అభిప్రాయభేదాలను దూరంచేసి వారి నడుమ సయోధ్య కుదిర్చి తిరిగి ప్రేమానురాగాలు పుట్టించే ప్రయత్నాలు చేయడమే సరైన మార్గం.

## బహుభార్యత్వం అనేక సమస్యలకు పరిష్కారం

## మంచి బంధుత్వాల కొరత

బహుభార్యత్వ చట్టం స్త్రీలను వేధించడానికో లేక వారి మనస్సుల్ని నొప్పించడానికో రాలేదన్నది గమనార్హం. మహిళే గనక తన స్థానం నుండి పైకెదిగి కొంత ఆలోచిస్తే, ఈ అనుమతిలో, తనలాంటి మహిళల శీలాన్ని సంరక్షించే మార్గం ఉందని గమనించగలదు. ఆ అనుమతి ప్రాధాన్యత ఏమిటో, సంవత్సరాల తరబడి ఓ గుణవంతుడైన భర్త కోసం ఎదురుచూసే మహిళ హృదయాన్ని తడితే తెలుస్తుందామెకు. అలా నిరాశా, నిస్పృహకు గురై చివరికి ఆమె తన మానాన్ని సైతం పణంగా పెట్టడానికి వివశురాలైపోయే సందర్భాలూ ఉన్నాయి.

తమ ఈడొచ్చిన ఆడపిల్లలకు సరైన సంబంధం దొరుకుతుందేమో అని ఎదరుచూసే ఆ ముసలి తల్లిదండ్రుల మనస్సులను తట్టి అడగండి, ఈ బహుభార్యత్వం విలువ, ప్రాముఖ్యతలు ఎలాంటివో! ఆ ఈడొచ్చిన కన్యలు ఎక్కడ షైతానుల వలయంలో చిక్కుకుపోతారో అనే బెంగతో వణికిపోతుంటారా తల్లిదండ్రులు. ఎందరు తల్లిదండ్రుల ఆశలు నిరాశ

లుగా మారిపోతున్నాయో, మరెందరు కన్యలు పోకిరీగాళ్ళ చేతికి చిక్కి నాశనమౌతున్నారో మనం చూడ్డం లేదా?

నేడు ఆడ కూతుళ్ళ సమస్య మరింత గడ్డుదైపోతోంది. సాధారణంగా ప్రజలు మగ సంతానాన్నే కోరుకుంటారు. అమ్మాయి పుడితే వారి ముఖం విచారంతో నిండిపోతుంది. నేడు ఏ మహిళైనా గర్భం ధరిస్తే ముందు ఆ గర్భంలో పెరుగుతున్న పిండం ఆడా! మగా! అనే సందిగ్ధంలో పడిపోతారు. వెంటనే స్కానింగ్ చేయించి పిండం అమ్మాయే అయితే ఆ భార్యాభర్తల ఆనందం కాస్తా మటుమాయమైపోతుంది. ఆ గర్భాన్ని పోగొట్టడానికి శాయశక్తులా ప్రయత్నిస్తారు.

ఈ వ్యాధి దాదాపు మన దేశంలోని అన్ని ప్రాంతాలకు కారుచిచ్చులా వ్యాపించింది. మన సమాజంలో సర్వసాధారణమైపోయిన భయంకర వ్యాధి ఇది.

ఈ శాపం వచ్చిందెక్కడి నుండి? దానికి చికిత్స ఏమైనా ఉందా? మనం సీరియస్‌గా ఆలోచించవలసిన విషయమిది. ఆడ పిల్లలు దైవ కారుణ్యం, ఇంటికి వెలుగు. మాతృగర్భంలోనే ఆడపిల్లల హత్య (భ్రూణ హత్య) ఈ నాగరిక యుగంలో ఎంత అజ్ఞానమైన చర్య?

## సంతానలేమి

బహుభార్యత్వ చట్టం మహిళల పాలిటి గొప్ప వరం. సంవత్సరాలుగా పిల్లలు కలగక బాధపడే స్త్రీలెంతమందో. స్త్రీలలో సంతానం కలగాలన్న కోరిక సహజమైన కోరిక. పురుషుడు కూడా కోరుకునేదదే. పిల్లలు లేని ఇల్లు పువ్వులు లేని పూదోట లాంటిది.

ఇలాంటి పరిస్థితిలో పురుషుడే గనక మరో పెళ్ళి చేసుకుంటే ఇంటి వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మార్చగలడు. పిల్లల కోసం పరితపించే

భార్యాభర్తలకు, రెండవ పెళ్ళి చేసుకోవడం వలన కలిగిన సంతానం ద్వారా కళ్ళు చల్లబడవచ్చు. అయితే, ఒకవేళ రెండవ పెళ్ళి చేసుకునే అనుమతే గనక లేకపోతే, ఆ ఉద్యానవనంలో వసంతం ఎలా రాగలుగుతుంది? ఆ అనుమతే లేని పక్షంలో రెండే రెండు మార్గాలను అవలంబించవలసి ఉంటుంది. జీవితాంతం అలా నిరాశా నిస్పృహలతో కాలం గడపడం ఒక మార్గమైతే, రెండవ మార్గం పిల్లలు కలగాలనే ఉద్దేశ్యంతో ఆ మొదటి భార్యను విడిచేసి మరో కొత్త భార్యను తీసుకొని రావడం. ఇలాంటి పరిస్థితిలో ఓ తెలివైన మహిళ, ముఖ్యంగా తనకు సంతానం కలగలేదని నిరాశపడుతున్న సమయంలో లేదా తనకు వ్యంధ్యత్వం ఉందని తెలిసిన తరువాత, తన ఇంటిని నాశనం చేసుకోవడానికి ఎలా ఒప్పుకుంటుంది?

## దీర్ఘకాలిక వ్యాధి, వికలాంగత

భార్య తన భర్త కామవాంఛను తీర్చలేని దీర్ఘవ్యాధికి గురైనప్పుడు లేదా ఆమె అతి బలహీనపడి ఎప్పుడు ఏదో ఓ రోగంతో బాధపడుతూ ఉంటే, అలాగే సాధారణ పరిస్థితుల్లో సైతం తన భర్త వైపు మొగ్గుజూపని స్థితిలో ఉండివుంటే ఆమె ఆ పరిస్థితిలో కోరుకునే ఈ అంశాలను గురించి ఆలోచించండి.

1. ఇలాంటి పరిస్థితి భర్తకు ఓ పరీక్షా సమయం. తాను ఇంట్లో ఉన్నా బయటకు వెళ్ళినా చిరాకుగానే ఉంటాడు. ఆమెతో సరిగా మాట్లాడడు. బయటి వారితోనూ అంత చనువుగా ఉండడు. ఇలా జరగాలని భార్య కోరుకుంటుందా?

2. భర్త దొంగచాటుగా వ్యభిచరించే స్త్రీలతో అక్రమ సంబంధాలు పెట్టుకోవడం, తనపై ఒలకబోసే ప్రేమనంతా ఇతర స్త్రీలపై ఒలక పోయడం, ఈ నేరం చేసినందుకు అతను సిగ్గుపడి భార్యతో మాట్లాడక పోవడం లాంటి వాటిని ఆమె సహించి ఊరుకోగలదా?

3. తన వ్యాధి లేదా బలహీనతల కారణంగా భర్త తనకు విడాకులు ఇచ్చి తనను వదిలించుకోవడానికి ప్రయత్నించినప్పుడు, తనకు భర్త ఆదరణ అవసరాలు కావలసిన ఆ పరిస్థితిలో అతను తనను ఏ ఆధారం లేకుండా వదిలేయడాన్ని ఒప్పుకోగలదా?

4. అలా జరగకుండా, ఆ ఇంటనే తాను ఇదివరకు ఉన్నట్లే ఇప్పుడూ ఉంటూ, భర్త రెండవ పెళ్ళి చేసుకొని ఇంకో భార్యను ఆ ఇంటికి తెచ్చి ఆమె ద్వారా తన కోరిక తీర్చుకోవడం, ఇంటి బాధ్యతలను మోస్తూ మొదటి భార్యకు కూడా సహాయపడాలని ఏ స్త్రీ కోరుకోదు? ఈ విధంగా ఆ ఇంటి వాతావరణంలో ఆనందం వెల్లివిరుస్తుంది. పరిశుద్ధ వాతావరణం నెలకొంటుంది. భార్యలిద్దరూ ఆ ఇంట పరస్పరం గౌరవంగా హాయిగా ఉండడం, భర్త తాను తన జీవితానికి తృప్తిపడడం, అక్రమ సంబంధాలు ఏర్పర్చుకోకుండా జీవితాన్ని ఆనందంగా గడపడాన్ని ఏ భార్య కోరుకోకుండా ఉండగలదు?

యదార్థం ఏమిటంటే బహుభార్యత్వపు చట్టం స్త్రీల కొరకు సంపూర్ణ కారుణ్యమే. స్త్రీకి ఎదురయ్యే సమస్యల నుండి, పరీక్షల నుండి ఆమెను గట్టెక్కించడానికే అల్లాహ్ ప్రసాదించిన చట్టమిది. దీనిద్వారా ఆమె మానం, శీలం సంరక్షించబడాలి. ఆమె బలహీనతలు, వ్యాధుల వల్ల ఆమెకు ఎలాంటి సమస్య ఉత్పన్నం కాకూడదనే ఆ చట్టం చేయబడింది. అయితే దీనితోపాటు ఓ షరతు కూడా విధించడం జరిగింది. భర్తలో దైవభీతి ఉండాలన్నదే ఆ షరతు. అతను అల్లాహ్ ఆదేశాలను జవదాటకుండా ఉండాలి. అల్లాహ్ ఆదేశాల పట్ల అతని మనస్సులో గౌరవభావం ఉండాలి.

## వితంతువులు, తలాక్ పొందిన స్త్రీల సమస్య

వితంతువులకు, తలాక్ పొందిన స్త్రీలకు బహుభార్యత్వపు చట్టం ఛత్రఛాయల్లోనే రక్షణ లభించగలదు అనే విషయాన్ని మనం గుర్తించాలి.

నేడు మన దేశంలో నికృష్టమైన జీవితం అనుభవిస్తున్న వితంతువులు, తలాక్ పొందిన స్త్రీలు ఎందరు లేరు? అది హిందూ సమాజమే కానివ్వండి, ముస్లిమ్ సమాజమే కానివ్వండి. వారి పరిస్థితి ఎంత దారుణమైనదో మనకు కనబడడం లేదా?

ఎందరు అభాగినులు దుఃఖసాగరంలో తేలుతూ జీవితాన్ని గడుపుతున్నారో! మరెందరు పరిస్థితులను ఎదుర్కొనలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారో! ఈ వార్తలను మనం ప్రతిరోజూ వార్తాపత్రికల్లో చదువుతున్నవే. ప్రపంచానికి తెలియని సంఘటనలు ఇంకెన్ని జరిగిపోతున్నాయో! ఈ పరిస్థితి ఒక మన భారతదేశానికి పరిమితం కాలేదు. దైవచట్టాన్ని ధిక్కరించినందుకు ప్రపంచం మొత్తమే ఈ దుష్పరిణామాలను చవిజూస్తోంది. నేడు ఈ మహిళల ఆర్తనాదాలు ప్రపంచాన్నే నరకంగా మార్చివేశాయి. బహుభార్యత్వపు దైవవ్యవస్థను ప్రక్కనబెట్టి ఈ వితంతువులు మరియు తలాక్ పొందిన స్త్రీల సమస్యలను పరిష్కరించడం అసాధ్యం.

బహుభార్యత్వపు ఆదేశం అందరిని దృష్టిలో ఉంచుకునే చేయడం జరిగింది. అయితే దివ్యఖుర్ఆన్ ఆదేశాలు ప్రత్యేకంగా అనాధలు, వితంతువులను దృష్టిలో ఉంచుకునే అవతరించబడ్డాయి. యుద్ధాల్లో వీరమరణం పొందిన వారి వితంతువులు మరియు అనాధల కోసమే ఇద్దరేసి, ముగ్గురేసి, నలుగురేసి స్త్రీలను వివాహమాడమని ప్రోత్సహించడం జరిగింది.

ఇస్లామ్ ధర్మం వితంతువులు, అనాధ పిల్లల సమస్యలకు ఎంత ప్రాధాన్యత నిచ్చిందో దీన్నిబట్టి మనం అంచనా వేసుకోవచ్చు. దీనికితోడు, ఒకవేళ ఈ బహుభార్యత్వ చట్టమే లేకపోయి ఉంటే వితంతువులు, తలాక్ పొందిన స్త్రీల వైపునకు ఎవరు కన్నెత్తి చూసేవారు? అనాధ పిల్లలకు ఆశ్రయం కల్పించే వారే కరువైపోయేవారు.

ఇస్లామ్ దైవకారుణ్యాన్ని కురిపించే ధర్మం. అది ప్రతి ఒక్కరి కన్నీళ్ళను తుడిచి వారి సమస్యలను పరిష్కరిస్తుంది. ప్రతి వాని జీవితాన్ని ఆనందమయం చేస్తుంది.

ప్రపంచం ఇప్పటివరకు వితంతువులు, విడాకులు పొందిన స్త్రీల సమస్యలను ఏమాత్రం తీర్చలేకపోయింది. వారికి గౌరవప్రదమైన జీవితం గడిపే ఏ మార్గం చూబెట్టలేక పోయింది. వారి సమస్యలకు పరిష్కారం ఎక్కడైనా లభించగలదంటే, అది ఒక ఇస్లామ్ ధర్మంలోనే సాధ్యం కాగలదు. వారికి గౌరవప్రదమైన జీవితం గడిపే మార్గం ఏదైనా ఉంటే అది ఇస్లామ్ ధర్మంలోనే.

## బహుభార్యత్వ చట్టానికి గుర్తింపు వస్తోంది

ఇస్లామ్ ధర్మాన్ని విమర్శించడంలోనే గ్రుడ్డిదైపోయిన ప్రపంచం ఓ వైపున ఇస్లామీయ బహుభార్యత్వ చట్టాన్ని విమర్శిస్తూ ఉంటే, మరోవైపు మేధావి వర్గం, బాధ్యతనెరిగిన వారు ఈ చట్టం ప్రాధాన్యతను, ప్రయోజనాన్ని అర్థం చేసుకొని ఒప్పుకోవడం కూడా జరుగుతోంది.

కొన్నేళ్ళ క్రితం ఈజిప్టు మరియు అరేబియాకు చెందిన ప్రముఖ పత్రికల్లో ఓ సంచలనాత్మకమైన వార్త వచ్చింది, దాని ప్రకారం జర్మనీ ప్రభుత్వం 'అల్ అజ్హర్ యూనివర్శిటీ' పండితులను, ఇస్లామ్ ధర్మంలో బహుభార్యత్వ వ్యవస్థకు సంబంధించిన వివరాలు మాకు తెలియజేయమని కోరింది. జర్మనీలో పెరిగిపోతున్న స్త్రీల సంఖ్య గడ్డు పరిస్థితిని సృష్టించి నందున దాన్ని పరిష్కరించేందుకు జర్మనీ ప్రభుత్వం ఇస్లామీయ బహుభార్యత్వ వ్యవస్థ మద్దతును తీసుకోవడానికి నిర్ణయించుకుంది.

ఈ వార్త దినపత్రికల్లో వెలువడిన కొన్ని రోజులకే జర్మనీ నుండి ఓ మేధావుల బృందం ఈజిప్టుకు రావడం, అక్కడ అల్ అజ్హర్ షేఖ్‌ను కలిసి వివరాలను సేకరించడం కూడా జరిగింది.

ఆ రోజుల్లోనే జర్మనీకి చెందిన కొందరు ముస్లిమ్ మహిళలు, స్త్రీల విషయంలో ఇస్లామ్ ఆదేశాలు ఏమిటో, ముఖ్యంగా బహుభార్యత్వానికి సంబంధించిన విధానాలను నేరుగా స్టడీ చేసేందుకు అల్ అజ్హర్‌లో అడ్మిషన్లు పొందడం కూడా జరిగింది.

ఇంతకు పూర్వం జర్మనీలో నాజీల పరిపాలనా కాలంలోనూ బహు భార్యత్వ చట్టాన్ని ప్రవేశ పెట్టేందుకు ప్రయత్నాలు జరిగి ఉన్నాయి. కాబట్టి 'హిట్లర్' ఓ ముస్లిమ్ పండితునికి, బహుభార్యత్వ చట్టాన్ని అమలుపరిచే ఉద్దేశ్యం తనకు ఉందని దాన్ని దృష్టిలో ఉంచుకొని ఆ చట్టం ముసాయిదాను తయారు చేయమని కోరాడు. కొన్ని రోజుల్లోనే రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభం అయింది. ఆ పనికాస్తా ఆగిపోయింది.

(అల్‌మర్‌అ బైనల్ ఫిఖ్హా వల్ ఖానూన్-పుట 76)

## లైంగిక విశృంఖలానికి ఆలవాలమై ఉన్న నాగరిక ప్రపంచం

నేడు ఇస్లామ్ ధర్మానికి బద్ధ విరోధులైనవారు, ఇస్లామీయ బహు భార్యత్వ వ్యవస్థను ఎగతాళి చేస్తూ దానిపై అనేక విమర్శనాస్త్రాలను సంధిస్తున్నారు. ముస్లిములు ఇద్దరేసి, ముగ్గురేసి, నలుగురేసి మంది స్త్రీలను వివాహమాడుతున్నారని అవహేళన చేస్తూ పరిహసిస్తున్నారు. ఇంత చేస్తూనే అసలు తమను తాము నాగరికులం, సభ్యతగల వాళ్ళం అని చెప్పుకునే వారు మాత్రం తమ పరిస్థితి ఏమిటో గమనించడం లేదు. ఆ సమాజంలో విపరీతంగా పెరిగిపోతున్న అక్రమ సంబంధాలు ఎలాంటి ఫలితాలను ఇస్తున్నాయో చూడడం లేదు.

ఇప్పుడు వారు చెబుతున్నట్లు, ముస్లిముల్లో బహుభార్యత్వానికి సంబంధించిన సంఘటనలు జరిగేవి అతి తక్కువ. కాకపోతే ఈ చట్టాన్ని అపహాస్యంపాలు చేస్తున్నవారికి మాత్రం, ప్రతి రాత్రి వసంత రాత్రే. ప్రతి పగలు వారికి ఓ కొత్త తరహా వ్యభిచార మార్గాన్ని సమకూర్చిబెడుతుంది.

అయిరోపా దేశాలకు వెళ్ళి చూడండి అక్కడి పరిస్థితి ఎలాగుందో. అక్కడ ప్రతి ఇద్దరు పిల్లల్లో ఒక పిల్లవాడు అక్రమ సంబంధాల వల్ల పుట్టినవాడే. వ్యభిచారం అనేది ఆ సమాజంలో తప్పుగా భావించబడదు. పైగా అది అక్కడి ఫ్యాషను. గర్ల్‌ఫ్రెండ్స్, మిస్ట్రెస్‌లు ప్రతివానికి నిత్యావసరంగా మారిపోయాయి. అక్కడి మత నాయకులు వారికి ఇచ్చిన స్వేచ్ఛ అది. చివరికి స్వలింగ సంపర్కానికి కూడా అక్కడ అనుమతి లభి స్తోంది. ఈ కారణం వల్లనే అక్కడ సుఖవ్యాధులు భయంకరంగా వ్యాపిస్తు న్నాయి.

ఎలాంటి మొహమాటం లేకుండా భార్యలను ఒకరికొకరు అప్పగించుకుంటారు. అందుకోసం పెద్దపెద్ద క్లబ్బులే ప్రత్యేకంగా వెలిశాయి. ఆ క్లబ్బులకు లైసెన్సులు కూడా ఇవ్వబడ్డాయి. ఈ వ్యాధి ఒక్క అమెరికా, అయిరోపా దేశాలకే పరిమితంగా లేదు. ఈ నవనాగరిక జాతులు ఎక్కడ కాలుమోపినా అక్కడ ఈ వ్యాధి ప్రబలిపోతోంది.

ప్రఖ్యాత మానసిక శాస్త్రవేత్త డాక్టర్ సి.జి. జంగ్ తన గ్రంథం 'Modern Man in Search of Soul' లో ఇలా రాస్తున్నాడు.

'ఆఫ్రికన్ దేశాల్లో క్రైస్తవ మిషనరీల ద్వారా బహుభార్యత్వం అంత మొందించబడిన ఫలితంగా వ్యభిచారం, లైంగిక విశృంఖలత మితిమీరి పోయాయి. ఒక 'యుగాండా' దేశమే ప్రతి సంవత్సరం సుఖ రోగాలను

అరికట్టేందుకు 20 వేల పౌనుల ధనాన్ని ఖర్చుపెట్టవలసి వస్తోంది. వాటి ప్రభావాలు, ఫలితాలు చెప్పలేనంత భయంకరంగా ఉన్నాయి."

లైంగిక విశృంఖలత్వంలో ఇంతగా కూరుకుపోయిన జాతుల్లో, వారి సమాజాల్లో సిగ్గు, బిడియం, లజ్జల్లాంటివి ఏమాత్రం కానరావు. నైతికతలు, పవిత్రతతో వారికి ఏ సంబంధమూ లేదు. నేటికీ ఓ మేలైన, పరిశుద్ధమైన చట్టాన్ని అవహేళనకు గురిచేస్తున్నాయంటే ఇంకేమనాలి?

దీనికి భిన్నంగా ఓ ప్రముఖ పాశ్చాత్య మేధావి 'సర్ జార్జి స్కాట్' (Sir Georg Scot) మాటలు ఇలా ఉన్నాయి:

"మన ఈ శతాబ్దంలో అతిగా పెరిగిపోతున్న స్త్రీల సంఖ్యను చూసి బహుభార్యత్వాన్ని బలపరిచేవారి సంఖ్య తక్కువ ఏమీ కాదు."
(Encyclopaedia of Modern knowledge ,Vol.V, Page-2572)

ఇలాగే ఫ్రాన్సు దేశానికి చెందిన లైంగిక శాస్త్రవేత్త 'లీబాన్', "ఓ రోజు రానుంది. యూరప్ దేశాలు తమ కోసం బహుభార్యత్వపు చట్టాన్ని పాసుచేయడానికి వివశమైపోతాయి."
(అల్‌మర్‌అహ్ ఫిల్ ఖుర్‌ఆన్-డాక్టర్ అబ్బాస్ మహ్మూదుల్ ఇఖాద్, పుట-117)

డాక్టర్ లీబాన్ ఈ మాటలు చెప్పడానికి గల కారణం ఏదై ఉంటుంది? బహుశా పెరిగిపోతున్న స్త్రీల సంఖ్యను దృష్టిలో ఉంచుకునే ఈ మాటలు ఆయన చెప్పి ఉండవచ్చు. ఎందుకంటే, నేడు ప్రపంచం మొత్తం మీద స్త్రీల సంఖ్య పురుషుల సంఖ్యకంటే అధికంగా పెరిగిపోతోంది. అధికారిక గణాంక వివరాల ప్రకారం రష్యాలో ఇప్పుడు స్త్రీలు పురుషులకంటే దాదాపు ఇరవై మిలియన్లు ఎక్కువ. పశ్చిమ జర్మనీ పరిస్థితి కూడా ఇదే. అక్కడ స్త్రీలు పురుషులకంటే ఇరవై మిలియన్లు అధికంగా ఉన్నారు.

అమెరికాలో వారి సంఖ్య పురుషుల కంటే 22 మిలియన్లు పెరిగిపోయింది. ఇతర దేశాల్లోనూ ఇదే పరిస్థితి.

(మకానతుల్ మర్అహ్- సాలిముల్ భన్సావీ, 198)

పెరిగిపోతున్న ఈ స్త్రీల సంఖ్య ప్రభుత్వాలకు తలనొప్పిగా మారి పోయింది. అందుకని ఎలాంటి నియంత్రణ లేని ఈ స్వతంత్ర స్త్రీలు సమాజం మొత్తాన్నే కలుషితం చేసిపారేస్తున్నారు. ప్రభుత్వాలు, మత నాయకులు కూడా విచ్చలవిడిగా వ్యభిచారాన్ని చేసే వెసులుబాటును కల్పిస్తున్నాయి. వ్యభిచారం అక్కడ ఎలాంటి నేరం కాదు. స్త్రీ పురుషు లుభయులు తమ ఇష్టంతో వ్యభిచరించవచ్చు. అయితే బలవంతంగా జరిగినప్పుడే అది నేరంగా పరిగణించబడుతుంది. ఈ కారణం చేతనే అక్కడ ఆఫీసుల్లో, క్లబ్బుల్లో గ్రౌండులో అశ్లీల దృశ్యాలను చూసి మానవత్వం తలదించుకోవలసి వస్తోంది.

ఇంతగా దిగజారిపోయిన ఆ సమాజం బహుభార్యత్వ చట్టాన్ని ఎలా పాసుచేయగలదు? డాక్టర్ లీబాన్ అంచనా ప్రకారం ఒకవేళ పాశ్చాత్య దేశాల్లో గనక ఈ చట్టం పాసైనా అది సమాజంలో అమలుకాని చట్టంగానే మిగిలి పోగలదు.

ఖుర్ఆన్ ఆదేశించిన బహుభార్యత్వ వ్యవస్థను అనుసరించడం ప్రతి జాతికి సాధ్యమయ్యే విషయం కాదు. దీన్ని అనుసరించాలంటే దృఢమైన వ్యక్తిత్వం, సద్వర్తనం తప్పకుండా ఉండితీరాలి. ఆ వ్యక్తిత్వమే, ఆ సుగుణ సంపదే కరువైన జాతి తన నైతిక బాధ్యతలను గుర్తెరుగని జాతి. మానవత్వం ఏమిటో తెలియని జాతి. తన భావోద్రేకాలకు కళ్ళెం వేయలేని జాతి. అలాంటి ఉత్తమమైన వ్యక్తిత్వం లేని ఆ జాతి ఇస్లామీయ చట్టాన్ని ఎలా అనుసరించగలదు? దానివల్ల ఒనగూడే సత్ఫలితాలను ఎలా ఆస్వాదించ గలదు?

## గత 'షరీఅత్'లలో (ధర్మశాస్త్రాల్లో) బహుభార్యత్వం

బహుభార్యత్వపు చట్టం దివ్యఖుర్ఆన్‌లోనే మొదటిసారిగా వెలువడ లేదు అన్నది గమనార్హం. దైవం తరపున అవతరించిన గత ధర్మశాస్త్రాల్లోనూ (షరీఅత్‌లలో) ఈ చట్టం ఉండింది. ఈజిప్టుకు చెందిన ప్రఖ్యాత పరిశోధకుడు 'అల్లామా ముహమ్మద్ గజాలి' ఇలా రాస్తున్నారు:

"అల్లాహ్ తరపున ఎన్ని షరీఅత్‌లైతే ఇంతవరకు వచ్చాయో వాటన్నిటి లోనూ బహుభార్యత్వపు చట్టం ఉంది అని పూర్తిగా విశ్వసిస్తున్నాం." (ఫిఖహు సియరాహ్-470)

బైబిల్ పాత నిబంధనలోనూ ఇది ఉంది. (తోరా గ్రంథం అధ్యాయం-21, వచనం 15)

'న్యూఫెల్డ్' (E.Neufeld) తన గ్రంథం Anicient Marriage Lawsలో ఇలా రాస్తున్నాడు:

"'తల్మూద్', తౌరా (తోరా) గ్రంథాలలోనూ ఈ అనుమతి ఉంది. ఇందులో ఎలాంటి షరతులు పెట్టబడలేదు. అయితే 'రబ్బానీయీన్' వర్గం ప్రకారం, బహుభార్యత్వంలో న్యాయంగా వ్యవహరించాలంటుంది."

బైబిల్‌ను తిరగేస్తే మనకు తెలిసే విషయం, హజ్రత్ ఇబ్రాహీం (అ) వారికి ఇరువురు భార్యలు, హజ్రత్ యాఖూబ్ (అ) గారికి కూడా ఇద్దరు భార్యలున్నారన్నది. అలాగే హజ్రత్ దావూద్ (అ), హజ్రత్ సులైమాన్ (అ) గార్లకు అనేక మంది భార్యలున్నారని తెలుస్తోంది.

ప్రస్తుతం క్రైస్తవ ప్రపంచం బహుభార్యత్వం నిషిద్ధమంటోంది. అయితే బైబిల్ అలాంటి వచనం గాని, దాన్ని హరాం చేసే ఏ ఊసుగాని

మనకు కనిపించదు. ఒక 'సెయింట్ ఫోయిస్' రాసిన కొన్ని పత్రికల్లో మాత్రం ఇది మనకు కనబడుతుంది. అది ఈ విధంగా ఉంది:

"పోపు లేదా ధార్మిక నాయకుడు (బిషప్) ఒకే ఒక భార్యను కలిగి ఉండడం అవసరం" అన్నదే ఆ సమాచారం.

పోప్ కోసం ఈ ప్రత్యేక సూచన చేయడంలో గల మతలబు ఏమి టంటే, సాధారణ పౌరుల కోసం ఎలాంటి నిషిద్ధం లేదు, 'వారి అవసరం మేరకు ఒకరికంటే ఎక్కువ మందిని పెళ్ళాడవచ్చు' అన్నది.

ఓ యూరోపియన్ చరిత్రకారుడు 'వెస్టర్ మార్క్' (Westermark) కథనం ప్రకారం అయిరోపాలో క్రీ.శ. 17 వరకు బహుభార్యత్వం అమలులోనే ఉండింది. దానికి క్రైస్తవ చర్చి అనుమతి కూడా ఉండింది. ఎన్సైక్లోపిడియా బ్రిటానికా చెబుతున్నట్లు మధ్యయుగంలో బహుభార్యత్వానికి చర్చి ప్రోత్సాహం కూడా ఉంటూ ఉండేది. చట్టపరంగా దానిపై అమలు కూడా జరిగేది. బహుభార్యత్వం ఓ గుర్తింపు పొందిన వ్యవస్థగా పదిహేడవ శతాబ్దం మధ్యకాలం వరకు అమలు జరిగింది. (సంపుటం 14, పుట 950)

క్రైస్తవుల్లో మార్మన్స్ (Mormons) పేరుగల ఓ తెగ ఉంది. వారి వాదన ప్రకారం రోమన్ క్యాథలిక్కులు (Roman Catholics), ప్రొట స్టాంటులు (Protestants) అసలు క్రైస్తవులే కారట. వీరు ఏసుక్రీస్తు తెచ్చిన క్రైస్తవాన్ని వదిలి అపమార్గం పట్టారంటారు. ఈ తెగకు చెందినవారు తామే అసలు క్రైస్తవులమని వాదిస్తారు. ఈ తెగలో నేటికినీ బహుభార్యత్వ సంప్ర దాయం ఉంది. దాన్నే వారు అసలు పవిత్రమైన వ్యవస్థగా తలుస్తారు. ఆ తెగకే సంబంధించిన ఓ మహిళను బహుభార్యత్వం గురించి తన అభిప్రాయం ఏమిటో చెప్పమని అడిగితే ఆమె నిస్సంకోచంగా ఇలా చెప్పింది:

'ఓ మధ్యతరగతి మనిషికి ఏకైక భార్యకావడం కంటే ఓ ఉత్తముడు, మేధావి అయిన పురుషునికి పదవభార్యగా ఉండడానికే నేను ఎక్కువగా ఇష్టపడతాను.''

(అల్‌మర్అతు బైనల్ ఫిఖ్హా వల్ ఖానూన్ -డాక్టర్ సబాయి, పుట -244)

దివ్యఖుర్ఆన్‌లోని ఏ అధ్యాయంలోనైతే బహుభార్యత్వపు అనుమతి లేక ప్రోత్సాహం ఇవ్వడం జరిగిందో (అంటే నిసా సూరా) ఆ విషయాన్ని లోతుగా ఆలోచిస్తే, బహుభార్యత్వం ఆదేశం మునుపటి షరీఅత్ లలో ఇచ్చినట్లుగానే ఇస్లామ్ ధర్మంలోనూ ఇవ్వడం జరిగింది అన్న విషయం అవగతం అవుతుంది. అంటే వారికి కూడా నలుగురేసి భార్యలను పెళ్ళాడే అనుమతి, ఆ భార్యల పట్ల న్యాయంగా ప్రవర్తించాలనే షరతు ఇవ్వడం జరిగిందన్నది.

## బహుభార్యత్వ వ్యవస్థ నిరాకరించ వీలులేనిది

బహుభార్యత్వపు దైవవ్యవస్థను మంచి నడవడి, మూర్తిమత్వం గల జాతి మాత్రమే అవలంబించగలదు అని మేము ఇంతకు ముందు చెప్పడం జరిగింది. దైవభీతి, ఆ చట్టం పట్ల గౌరవం, భావావేశాల్లో పవిత్రత, పరిశుద్ధత, కౌటుంబిక మరియు సామాజిక బాధ్యతలను మోసే ధైర్యం, మహిళల పట్ల ప్రేమానురాగాలు, సానుభూతులు ఉన్నంతవరకు ఆ జాతులు ఆ వ్యవస్థను అవలంబించడం జరిగింది. ఇతరులను కూడా ఆ జాతులు ఆ మార్గాన్ని అవలంబించేందుకు పిలుపునిచ్చాయి. ఆ జాతి ప్రజలు తమ స్త్రీలతో తమ వాంఛల్ని తీర్చుకుంటూ దాని ఫలితంగా ఏ బాధ్యతలైతే తమపై బడ్డాయో వాటిని నెరవేర్చగలిగాయి.

ఓ సుదీర్ఘ కాలం వరకు అలా సాగుతూనే పోయింది. ఆ తరువాత వారు దైవానికి దూరం కావడం, ఏమరుపాటుకు గురికావడం జరిగింది.

వారిలో స్వార్థం, లైంగిక విశృంఖలత్వం వచ్చేసింది. వారి కామవాంఛ కట్టలు త్రెంచుకుంది. అలా మితిమీరిన కామోద్రేకాల వల్ల వారిలో ఓ రకమైన ఉన్మాదం ఏర్పడి స్త్రీ జాతిపై విరుచుకుబడ్డారు. నైతిక పరిధులేవో పట్టించుకోలేదు. స్త్రీయే వారి సర్వస్వంగా మారిపోయింది. వారి కామోద్రే కాలకు, వ్యభిచారానికి అడ్డుగా నిలిచిన బహుభార్యత్వ వ్యవస్థను అంత మొందించేశారు. ఈ వ్యవస్థలో కేవలం నాల్గు పుష్పాలను మాత్రమే అఘ్రాణించే అనుమతి ఉంది. ఆ నాల్గు పువ్వులు వారికి సరిపోలేదు. వారికి ఓ పూల వనమే అవసరం వచ్చింది.

ఈ దైవ వ్యవస్థ ప్రకారం, మనిషి ఎందరు స్త్రీలతోనైతే సుఖం పొందుతాడో ఆ స్త్రీల సమస్త బాధ్యతలను మోస్తాడు. కాని ఏ జాతిలోనైతే వ్యభిచారం, స్త్రీలోలత్వం పుట్టుకొస్తుందో ఆ జాతికి స్త్రీ మానాన్ని అపహ రించడం ఒక్కటే తెలుసు. అంతేగాని వారిపట్ల ఏమాత్రం సానుభూతి చూయించడం జరుగదు. ఆ తరువాత స్త్రీ గతి ఏమైపోతుందో, ఆమె మునుముందు ఎలాంటి కష్టాలకు గురౌతుందో తెలియదు. ఆమెను పట్టించుకోవడమే జరుగదు.

## బహుభార్యత్వం వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలు - వాటి పరిష్కారం

ఇప్పటి వరకు మనం చర్చించిన దాని ప్రకారం, ఇస్లామీయ బహు భార్యత్వ వ్యవస్థ అనేక కౌటుంబిక, సామాజిక సమస్యలను విజయవంతంగా పరిష్కరించే సహజమైన వ్యవస్థ అని తెలుసుకున్నాం. అలాగే ఈ వ్యవస్థను అవలంబించనంత వరకు సమాజంలో పరిశుద్ధత ఏర్పడదు అని తెలుసు కున్నాము. అదే విధంగా దీన్ని అనుసరించకుండా వితంతువులు, అనాధలు, విడాకులు పొందిన స్త్రీలు గౌరవప్రదమైన జీవితాన్ని గడుప

జాలరు అని, ఈ వ్యవస్థను అనుసరించకుండా జాతికి చెందిన ఈడొచ్చిన కన్యలందరి వివాహాలు జరగలేవు అని, దాన్ని అవలంబించకుండా పోకిరిగా తిరిగేవారిని, చెడు అలవాట్లు కలిగివున్న యువకులను సరైన మార్గంలో ఉంచలేము అన్న యదార్థాన్ని కూడా తెలుసుకోగలిగాము.

ఇస్లామీయ బహుభార్యత్వపు చట్టంలోని ఈ సుగుణాలన్నీ నిరాకరించరానివి. అయితే ఈ వ్యవస్థను అమలు చేయడం సాధ్యమయ్యే విషయమా? అని ఎవరైనా అడగవచ్చు. దీన్ని అనుసరించడం వలన కొన్ని ప్రమాదాలు, మరికొన్ని ఆటంకాలు కూడా ఉన్నాయన్నది కొంతవరకు నిజమే.

అయితే దీన్ని మరో కోణంతో జూస్తే ఇది ఓ ఊహాజనితమైన వ్యవస్థ కాదు, ముస్లిమ్ సమాజంలో శతాబ్దాలుగా ఎంతో విజయవంతంగా కొనసాగుతూ వస్తున్న ఓ కార్యాచరణ వ్యవస్థ అని తెలుసుకోగలం. దీనికి సంబంధించిన కొంత వివరణ వెనుకటి పుటల్లో మనం చదువుకున్నదే. అంటే దాని వలన ఏర్పడే ఏ సమస్యలు అయితే ఉదాహరణగా చెప్పు కోవడం జరుగుతోందో, ఆ సమస్యలు పరిష్కరించ సాధ్యంకాని సమస్యలు ఏవీకావు. కొన్ని ప్రమాదాలు ఉన్న మాట నిజమైనప్పటికీ ఆ ప్రమాదాలు నియంత్రించ లేనటువంటివి ఏవీకావు.

## మొదటి భార్య మనస్తాపం సమస్య

ఈ విషయంలో వచ్చే ఏ అడ్డంకి లేదా ఆటంకాన్ని చెప్పుకోవడం జరుగుతోందో అది మొదటి భార్య మనస్సును బాధించే విషయం. మొదటి భార్య రెండవ భార్య రాకను ఏమాత్రం ఒప్పుకోదు. ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా మరో పెళ్ళి చేసుకున్నప్పుడు, అది ఆమె పట్ల జరిగిన అన్యాయంగా చెప్పుకోబడుతుంది. కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పులోనూ

ఇదే మాట చెప్పడం జరిగింది. న్యాయాధీశుడు ఇచ్చిన తీర్పు పదాలు ఈ విధంగా ఉన్నాయి:

"A Second marriage not a single but a continuing wrong to the first wife."

(రెండవ పెళ్ళి ఏదో ఒక అన్యాయం కాదు. పైగా అది మొదటి భార్య పట్ల జరుగుతున్న నిరంతర అన్యాయం.)

ఇలాంటి మాటలు సాధారణంగా చెప్పుకునే మాటలే. వ్యక్తిగతంగా బహిరంగ సభల్లోనూ ఈ మాటలు మనం వింటూనే ఉంటాం. ఈ సంద ర్భంలో కొన్ని అంశాలను దృష్టిలో ఉంచుకుంటే, బహుశా ఆ ఆక్షేపణలు చేసే అవకాశమే రాదు.

1. రెండవ పెళ్ళి అంటే మొదటి భార్యను నొప్పించడంగాని, సజావుగా సాగే ఇంటి వాతావరణాన్ని చెడగొట్టడం కాదు. కాబట్టి ఈ ముఖ్య మైన నిర్ణయాన్నిగైకొనే ముందు భర్త మొదటి భార్యతో సంప్రదించ వలసి ఉంటుంది. ఆమె దానికి ఒప్పుకోకపోతే ఎంతో మృదువుగా, ప్రేమగా ఆమెను సంతృప్తిపరిచే ప్రయత్నం చేయాలి. ఆమె పట్ల ఎలాంటి అన్యాయం జరుగదని ఆమెకు పూర్తి నమ్మకాన్ని కలిగేటట్లు చెప్పవలసి ఉంటుంది.

   రెండవ పెళ్ళి అవసరం ఎందుకు ఏర్పడిందో, ఆ కారణాలను ఆమెకు నిజాయితీగా వివరించవలసి ఉంటుంది.

2. ఒకవేళ మాటల ద్వారా ఆమెను సంతృప్తిపరిస్తే మంచిదే. అయినా ఆమె తృప్తిపడకపోతే భర్త తొందరపాటుకు గురికాకూడదు. చెడిపోయిన ఆ వాతావరణంలో ఏ స్త్రీ అయినా, భర్త రెండవ

పెళ్ళికి ఒప్పుకోవడం అంత సులువు కాదు. ఒకవేళ ఆమె సరే అని అన్నా, ఇరుగుపొరుగు అమ్మలక్కలు, బంధువుల ఎత్తిపొడుపులను ఆమె ఓర్చుకోలేని స్థితిలో ఉంటుంది. ఇలాంటి పరిస్థితిలో భార్య వైవశ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆ మార్గంలో వచ్చే అడ్డంకులను దూరం చేసే ప్రయత్నం చేయాలి. ఆ మార్గాన్ని సుగమం చేయడానికి కుటుంబంలోని ఇతరుల సహాయాన్ని కూడా కోరాలి.

3. ఇన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ భార్య రెండవ పెళ్ళికి ఒప్పుకోకపోతే భర్త ప్రస్తుతం ఆ రెండవ పెళ్ళి తనకు అనివార్యమైన అవసర మేనా? లేదా? అది కేవలం తన కోరికమట్టుకేనా అని పునః సమీక్షించుకోవలసి ఉంటుంది. అదేగనక అతని అనివార్య అవసరం అయితే అదే విషయాన్ని తన భార్యకు చెప్పేయాలి. ఆమెను దానిగురించి ఆలోచించుకునే అవకాశం ఇవ్వాలి. ఇలాంటి పరిస్థితిలో ఆమె తన భర్త ఇంటే ఉండడానికి ఒప్పుకుంటే ఆమెను అన్ని రకాలుగా సంతోషపరిచే ప్రయత్నం చేయాలి. రెండవ భార్యను తీసుకువచ్చినప్పటికీ భర్త, చేతుల ద్వారా ఎలాంటి హాని కలుగ బోదు, ఆమె గౌరవానికి ఎలాంటి లోటురాదు అనే నమ్మకాన్ని కలిగించవలసి ఉంటుంది.

4. భార్య ఇలాంటి పరిస్థితిలో తనతో సంసారం సాగించడానికి సిద్ధపడక పోతే, ఆమె స్వయంగా భర్త నుండి వేరైపోదలిస్తే షరీఅత్ ప్రకారం ఆమెను తనతోపాటే ఉండమని బలవంతం చేసే హక్కు భర్తకు ఏమాత్రం ఉండబోదు. కాకపోతే భర్తే తన నిర్ణయాన్ని పునఃసమీ క్షించుకోవలసి ఉంటుంది. పరిస్థితులన్నిటినీ దృష్టిలో ఉంచుకొని రెండవ పెళ్ళి చేసుకోవడమా లేదా? ప్రస్తుత పరిస్థితిపై **సహనం**

వహించి ఊరుకోవడమా అనేది తానే నిర్ణయించుకోవలసి ఉంటుంది.

రెండవ పెళ్ళి అనివార్యం అని తాను నిర్ణయించుకున్నప్పుడు, మొదటి భార్యను ఆమె కోరిక మేరకు షరీఅత్ ప్రకారం ఆమె హక్కులన్నిటిని సంతోషంగా ఇచ్చివేసి గౌరవంగా సాగనంపేయాలి. అంతేగాని ఆ హక్కుల్ని పొందడానికి, లేదా వేర్పాటుకోసం ఆమె కోర్టుల చుట్టూ తిరిగే అవసరంగాని, పోట్లాటలకు దిగే అవకాశాన్ని గాని రానివ్వకుండా చూడాలి.

5. భర్తే గనక మంచి వ్యక్తిత్వం గలిగి, ఆమె పట్ల న్యాయంగా మెలిగే వాడైతే ఏ భార్యా తన భర్తను వదులుకోవడానికి ఇష్టపడదు అన్నది యదార్థం. అన్ని పరిస్థితుల్లోనూ ఆమె తన భర్త ప్రేమచ్ఛాయల్లోనే బ్రతకడానికి, చావడానికి సిద్ధపడుతుంది. అతనిని సంతోషపెట్టడం లోనే తనకు ఆనందం గలదని, గౌరవం ఉందని తలుస్తుంది. కాబట్టి ఎవరైనా రెండవ పెళ్ళి చేసుకోదలిస్తే, మొదట తన వ్యక్తిత్వం ద్వారా, నైతికతల ద్వారా మొదటి భార్య సంపూర్ణ విశ్వాసాన్ని పొంద వలసి ఉంటుంది. తన వైఖరి, నడవడికల ద్వారా అతను నిస్వార్థ మైన ప్రేమను ప్రదర్శించవలసి ఉంటుంది.

## పిల్లల ఝుంజాటం

ఒకరికంటే ఎక్కువ భార్యలుండి, వారికి సంతానమూ ఉన్నప్పుడు ఆ భార్యల పిల్లల్లో సమానత్వం ఉండదు. ఆ పిల్లలు పరస్పరం వైరాన్ని పెంచుకుంటారు అన్నది మరో ఆక్షేపణ.

ఇవి కూడా చెప్పుకునేమాటలే. వాటికి ఆధారం ఏదీ లేదు. పిల్లలకు మంచి శిక్షణ లభించకపోతే, మంచి భావాలను వారిలో పుట్టించకపోతే

ఒకే తల్లికి పుట్టిన సొంత సోదరుల్లోనూ రక్తపాతం జరగడం యదార్థం. ఈ సంఘటనలు కోకొల్లలు. ఉదాహరణలిచ్చే అవసరం లేదు. దానికి భిన్నంగా ఇంటి వాతావరణం పరిశుద్ధంగా ఉండి, పిల్లల విద్యాబుద్ధులు, వారి శిక్షణ కోసం మంచి వీలును కల్పిస్తే ఇంటి పెద్దల్లోనూ పరస్పరం ప్రేమాను రాగాలు, త్యాగాలు వెల్లివిరిసినట్లయితే అదేవిధంగా పిల్లల పట్ల న్యాయం జరిగి వారి నడుమ ఎలాంటి హెచ్చుతగ్గులకు ఆస్కారం కల్పించక పోతే ఆ పిల్లలు ఎందరో తల్లుల పిల్లలైనాసరే ప్రేమానురాగాలతో మెలుగు తారు. ఒకరిపట్ల మరొకరికి సానుభూతి ఉంటుంది.

మన ముస్లిమ్ సమాజంలో బహుభార్యత్వానికి ఓ సుదీర్ఘ చరిత్రే ఉంది. మదీనా మొదటి ముస్లిమ్ బస్తీ బహుభార్యత్వ సంప్రదాయం సిద్ధాంతంపైన్నే స్థాపించబడింది. ఆ తరువాత వందలాది సంవత్సరాల వరకు ఆ బస్తీలు అలా నెలకుంటూనే పోయాయి. ఇలాంటి బస్తీల్లో ఏనాడూ కూడా ఇలాంటి చిక్కులు పొడసూపలేదు.

ప్రస్తుతం సౌదీ అరేబియాలో 'ఆలె సఊద్' (సఊద్ కుటుంబం) ఉదాహరణనే తీసుకుందాం. కింగ్ అబ్దుల్ అజీజ్ భార్యలకు కలిగిన సంతా నంలో అనేకమంది కుమారులున్నారు. ఆ కుమారుల నడుమ ఎలాంటి వైరం, మరెలాంటి అభిప్రాయభేదాలు రాలేదు. దానికి భిన్నంగా వారి నడుమ పరస్పరం ఎంతో ఆదరణ, ప్రేమానురాగాలున్నట్లు మనం గమనించగలం. చిన్నల పట్ల ఆదరణ, పెద్దల పట్ల గౌరవభావాలు వెల్లివిరుస్తున్నాయి. ఒకరికి వ్యతిరేకంగా మరొకరు ఎలాంటి కుట్రల్ని పన్నడం లేదు. వారి నడుమ ఎలాంటి సంఘర్షణా కానరాదు. ఒకరు చనిపోతే ఆ తరువాతి వాడు ఆ స్థానాన్ని పూరిస్తున్నాడు. అధికారంలోనికి వచ్చిన వానికి సోదరుల అండదండలుంటున్నాయి. అసలు, పరిపాలన అంటేనే తోడబుట్టిన సోదరులలో పరస్పరం శత్రువులుగా మార్చివేసేది. గతించిన

ప్రభుత్వాల చరిత్రను తిరగేస్తే ఎందరు తమ సొంత సోదరుల్ని హతమార్చిన దాఖలాలు లేవు?

యదార్థం ఏమిటం సోదరుల్లో వెల్లివిరిసే పరస్పర సోదరభావం, ప్రేమానురాగాలు లేదా పరస్పర విద్వేష వైషమ్యాలు, శత్రుత్వాలన్నీ ఇంటి వాతావరణం, బాల్యంలో వారికి గరిపే శిక్షణపైన్నే ఆధారపడి ఉంటాయి. మంచి శిక్షణ, మంచి వాతావరణమే లేకపోతే ఒకే తల్లి రొమ్ము పాలు త్రాగిన సోదరులు కొట్టుకు చస్తారు. దానికి భిన్నంగా మంచి వాతావరణం, మంచి శిక్షణ లభించిన ఇంట పుట్టి, అనేకమంది తల్లుల ద్వారా సాకబడిన సంతానం కలిసి మెలిసి ఉంటుంది. ఒకరిపై మరొకరు ప్రాణాలను అర్పించడానికి సిద్ధంగా ఉంటారు.

## చెడిపోయిన పరిసరాల వాతావరణ ప్రభావం

బహుభార్యత్వం మార్గంలో నిలిచే మూడవ అడ్డంకి చెడిపోయిన పరిసరాల వాతావరణ దుష్ప్రభావం. ఇదే ఈ మార్గంలో అన్నిటికంటే గొప్ప ఆటంకంగా మారిందని చెప్పవచ్చు.

నేడు ఎవరైనా రెండవ పెళ్ళి చేసుకుంటే, ఆలోచన లేకుండానే అతడు మొదటి భార్యకు అన్యాయం చేశాడని, ఆమెను అగౌరవానికి గురిచేశాడని అంటుంది లోకం. దాని గురించే తీవ్రంగా ఆలోచిస్తూ ఉంటారు జనం. ఎందరో వ్రేలెత్తి మరీ చూపడం జరుగుతుంది. ఇరుగు పొరుగు అమ్మ లక్కలు ఆమె దగ్గరకు వచ్చి ఆమెను మరింత ఉసిగొల్పు తుంటారు. భర్తకు శాపనార్థాలు పెడుతుంటారు. ఆ మొదటి భార్య భవిష్యత్తుకు సంబంధించి వారు చేసే వ్యాఖ్యలకు ఆమె బ్లడ్ ప్రెషర్ పడిపోతుంది. తన భర్త గురించి ఆమెకు ఇప్పటి వరకు రాని అనుమానాలు ఆమె మెదడును తొలిచేస్తూ ఉంటాయి.

ఫలితంగా తన భర్తపై ఉన్న నమ్మకం కాస్తా వమ్మైపోతుంది. ప్రతి విషయాన్ని సీరియస్‌గానే తీసుకుంటూ ఉంటుంది. ఇలా మానసికంగానూ, శారీరకంగానూ ఆమె తన భర్తకు దూరం అవుతూ ఉంటుంది. తన ఇంటికి వచ్చిన సోదరి సమానురాలైన స్త్రీ పట్ల అసహ్యతను ప్రదర్శిస్తూ ఉంటుంది.

భర్తపై అనుమానం, సవతి పట్ల అసహ్యాభావం రెండూ కలిసి ఆ చెడును తారా స్థాయికి చేర్చివేస్తాయి. ఇలా మనిషి ఎంత చిత్తశుద్ధి కలిగి ఉన్నప్పటికీ పరిసరాల కాలుష్యం కారణంగా అతను ఇద్దరు భార్యల్ని కలిపి ఉంచడంలో విఫలుడైపోతాడు.

చెడిపోయిన వాతావరణానికి మరో కారణం ఉంది. ఎందరో రెండవ పెళ్ళి చేసుకున్నారు కాని ఆ పెళ్ళిళ్ళ సూక్ష్మతను గ్రహించలేకపోయారు. భార్యల హక్కులను తీర్చడంలో న్యాయంగా మెలగ లేదు. ఆ వ్యవహారంలో ఓ ఉత్తముడైన, దైవభీతిగల భర్త పాత్రను పోషించలేదు. తమ బాధ్యతల్ని నిర్వహించే బదులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఇస్లామ్ శత్రువులకు పరిహసించే అవకాశాన్ని కల్పించారు. పాశ్చాత్య సభ్యతకు బానిసలై పోయిన ముస్లిమ్ వర్గం ఆలోచనలు కూడా పెద్దగా చెడిపోయాయి. ఇక ముస్లిమ్ స్త్రీల విషయమంటారా! వారి మనస్సుల్లో భయం చోటుచేసుకుంది. బహుభార్యత్వం అంటేనే వారికి వణుకు పుట్టనారంభించింది.

దాని ఫలితమే బహుభార్యత్వం ముస్లిమ్ సమాజానికి నచ్చకపోవడం. చివరికి ఇస్లామ్ బద్ధ శత్రువులు కూడా దీన్ని సాకుగా తీసుకొని ఇస్లామీయ షరీఅత్‌ను పరిహసిస్తూ ఉంటే నిలబడి వారికి జవాబు చెప్పే ధైర్యం కూడా లేకపోయింది వీరికి.

ఈ విధంగా ఈ దైవచట్టం దాదాపుగా అమలుకాకుండా ఉండిపోయింది. దీనివల్ల సమాజానికి ఏ ప్రయోజనాలైతే చేకూరాయో ఆ ప్రయోజనాలు నేడు ఈ సమాజానికి దక్కకుండా పోయాయి.

ఇదంతా ఎందుకు జరిగింది? కారణం సుస్పష్టం. బహుభార్యత్వం చట్టాన్ని అనుసరించాలంటే గొప్ప వ్యక్తిత్వం, దైవభీతి, దైవంతో పటిష్టమైన సంబంధం అవసరం. ఆ నడవడి, ఆ దైవభీతి, దైవంతో ఆ పటిష్టమైన సంబంధం కరువైపోతే ఓ పిచ్చివాని చేతికి అందించిన దివిటీలా మారి పోతుంది. ఆ దివిటీతో పరిసరాలు వెలుగొందుతాయి. కాని ఆ దివిటే పిచ్చివాని చేతికిస్తే అతడు ఏ ఇంటినైనా కాల్చి భస్మీపటలం చేయగలడు.

కుటీరానికి వెలుగునిచ్చేది అందులో వెలిగే దీపమే. కాని ఆ దీపంతోనే ఆ కుటీరాన్ని బూడిదగా మార్చవచ్చు.

★★★

## సారాంశం

1. ఇస్లామీయ బహుభార్యత్వపు చట్టం అనేక సామాజిక సమస్యల పరిష్కారం.

2. ఆ చట్టం లేకుండా పరిశుద్ధమైన సమాజం నెలకొనజాలదు.

3. ఇస్లామీయ బహుభార్యత్వపు చట్టం తప్ప వితంతువులు, విడాకులు పొందిన స్త్రీల సమస్యలు మరే చట్టం ద్వారా పరిష్కరించబడవు.

4. ఈ చట్టాన్ని అనుసరించకుండా మహిళల శీల సంరక్షణ అసాధ్యం.

5. బహుభార్యత్వం అంటే విశృంఖల లైంగికత్వం కాదు, అది సామాజిక బాధ్యతలను నెరవేర్చడం.

6. బహుభార్యత్వం అనుమతి కేవలం సత్ప్రవర్తన, మూర్తిమత్వం, మంచి శక్తి సామర్థ్యాలుగలవారికే. సద్గుణ సంపన్నమైన జాతే దానికి తగినది. దుర్గుణాలు కల జాతి దాన్ని ఏమాత్రం అమలుపర్చజాలదు.

7. ఈ ఇస్లామీయ చట్టాన్ని అవలంబించకపోతే సమాజంలోని పోకిరులను, చెడు నడతగల యువకులను నియంత్రించడం సాధ్యం కాదు.

8. బహుభార్యత్వం అవలంబనలో న్యాయాన్ని, ధర్మాన్ని లెక్కచేయక పోతే అది పుణ్యకార్యం అనిపించుకోదు. ఘోరమైన పాపంగా పరిణమిస్తుంది.

9. బహుభార్యత్వం అంటే దౌర్జన్యం కాదు. అభాగినుల కంటి తుడుపు.

10. పాశ్చాత్య నాగరికత కేవలం నగ్నత్వం మరియు అశ్లీలమే. అసభ్యత వల్ల స్త్రీలు ఎంత అగౌరవం పాలయ్యారో బహుశా చరిత్రలోనే అలా జరుగలేదు.

11. కేవలం ఇస్లాం ధర్మం ఒక్కటే స్త్రీ జాతికి గౌరవాన్ని ప్రసాదించింది.

12. ముస్లిములలోనే బహుభార్యత్వం తక్కువ. బహుభార్యత్వాన్ని అవలంబించే ముస్లిములలోనూ సాధారణంగా ఇద్దరు భార్యలకంటే ఎక్కువ మంది లేరు. అయితే ఏ జాతులైతే ఇస్లామీయ బహు భార్యత్వ చట్టాన్ని పరిహసిస్తున్నాయో లేదా దాన్ని ఆక్షేపిస్తున్నాయో వారికి చట్టపరంగా ఒకే భార్య ఉన్నా అక్రమంగా ఉండే భార్యలకు కొదవలేదు.

13. భారతీయ సమాజంలో బహుభార్యత్వం అంటే మొదటి భార్యను కించపర్చడంగా భావించడం జరుగుతోంది. ఇక్కడ సమాజం ఆలో చనలను మార్చనంత వరకు ఇక్కడ బహుభార్యత్వ చట్టం అమలు సాధ్యం కాదు.

14. ప్రస్తుత సమాజంలో ఒకరికంటే ఎక్కువ మంది భార్యలను పెళ్ళా డాలంటే ముళ్ళపొదలో చిక్కుకోవడం లాంటిది. అది పురుషునికి ఓ పరీక్షగా మారిపోయింది.

- సమాప్తం -

ఈ భూమిపై మనం ఎలా బ్రతకాలి, ఆయనిచ్చిన వస్తువుల్ని మనం ఎలా వాడాలి, వాటి విధానం కూడ మాకు తెలియజేశాడు ప్రభువు. ఈ విషయ ప్రబోధన కోసం అల్లాహ్ ప్రవక్తల్ని పంపించాడు. ప్రవక్తలు ప్రభువు గ్రంథాల్ని కూడా తెచ్చి ఇచ్చారు. ఈ గ్రంథాలలో దైవాజ్ఞలున్నాయి. జీవితం గడిపే మార్గం ఉంది. ప్రవక్తల పరంపరలో మహాప్రవక్త ముహమ్మద్(స) చివరివారు. వీరిపై దివ్యగ్రంథం ఖుర్ఆన్‌ను అవతరింపజేశాడు. మానవాళి కోసం పంపబడిన చివరి గ్రంథమిదే. ఈ గ్రంథం పొల్లుపోకుండ భద్రంగ ఉంది. అసలు రూపంలో ఉంది. దీనికంటే ముందు పంపబడిన గ్రంథాలలో ప్రజలు మార్పులు చేర్పులు చేశారు, కొన్నిటిని చిత్తు కాగితాల్లా వేస్టు చేసుకొన్నారు. కాని అల్లాహ్ స్వయంగ తన గ్రంథం ఖుర్ఆన్‌ను భద్రపరిచే బాధ్యత తీసుకొన్నాడు.

**ఇంకా ఇస్లాం మౌలిక విషయాల విస్తృత అధ్యయనానికి, అవగాహనకు చదవండి:**

# ఇస్లాం ప్రబోధిని

**1 నుండి 4 భాగాలు**

మూలం: **మౌలానా అఫ్జల్ హుసైన్** తెలుగు అనువాదం: **అబ్బాదుల్లా**

వివరాలకు:

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002. ఫోన్: 24564583